# ధరాఘాతం

**ఇరకాటంలో ఇంటి బడ్జెట్ • సబ్బులు, హెయిర్ ఆయిల్స్ ప్రియం**

**2 నుంచి 11 శాతం పెరిగిన రేట్లు • సామాన్యుల నెత్తిన భారం**

**ఆయా ఆహారోత్పత్తుల ధరలూ 17 శాతందాకా పైకి**



***ధరలు పెరుగుతున్నాయి. ఇంటి ఖర్చులు తడిసిమోపెడవుతున్నాయి.***

***సబ్బులు, సర్ఫ్ పౌడర్ల దగ్గర్నుంచి తలంటుకునే నూనెలు, పొద్దున్నే చకచకా చేసుకుతినే నూడుల్స్‌దాకా ప్రియమైపోయాయి.***

***ఎఫ్ఎంసీజీ కంపెనీలు ఆహార, వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తుల రేట్లను పెంచడంతో గత 2-3 నెలలుగా నెలవారీ షాపింగ్ బిల్లులు మోత మోగిస్తున్నాయి మరి.***

న్యూఢిల్లీ, జూన్ 18: ధరల మంట మొదలైంది. సామాన్యుల ఇంటి బడ్జెట్ తలకిందులవుతున్నది. సబ్బులు, హెయిర్ ఆయిల్స్, ఆహారోత్పత్తులు అన్నింటి రేట్లనూ ఫాస్ట్ మూవింగ్ కన్స్యూమర్ గూడ్స్ (ఎఫ్ఎంసీజీ) కంపెనీలు పెంచుకుంటూపోతున్నాయి మరి. గడిచిన 2-3 నెలల్లో 2 నుంచి 17 శాతం వరకు పెరిగిన ధరలతో బిల్లులు మోత మోగిస్తున్నాయి. గత కొంత కాలంగా మౌనంగా ఉన్న సంస్థలు.. ఇప్పుడు మళ్లీ బాదుడు మొదలుపెట్టాయి. రాష్ట్ర, జాతీయ స్థాయి ఎన్నికలు ముగిసిన వేళ.. ఎఫ్ఎంసీజీల రేట్ల పెంపు ప్రస్తుతం సర్వత్రా ఆసక్తిదాయకంగా మారుతున్నది.

**ఇదీ సంగతి..**

సబ్బులు, బాడీ వాష్‌ల ధరలు 2 నుంచి 9 శాతం పెరిగినట్టు తాజా లెక్కలు చూస్తే అర్థమవుతున్నది. హెయిర్ ఆయిల్స్ ధర 8 నుంచి 11 శాతం ఎగబాకగా, వివిధ రకాల ఆహారోత్పత్తుల ధరలు 3 నుంచి 17 శాతం ఎగిసినట్టు తేలింది. నిజానికి 2022, 2023 ప్రథమార్ధం వరకు ధరల్ని పెంచుతూపోయిన ఎఫ్ఎంసీజీ సంస్థలు.. ఆ తర్వాత సైలెంటైపోయాయి. ముఖ్యంగా క్రూడ్, పామాయిల్ ధరలు మార్కెట్‌లో తగ్గుముఖం పడుతున్న వేళ సబ్బుల ధరలు పెరగడం గమనార్హం. ఇక పాలు, చక్కెర, కాఫీ, కొబ్బరి, బార్లీ వంటి వాటి ధరలు కూడా విజృంభిస్తున్నాయి.

**ఇంకా పెరగొచ్చు**


ఆయా ఉత్పత్తుల ధరలు ఇప్పటికే పెరిగాయని, మున్ముందు ఇంకా పెరుగుతాయని కంపెనీలు స్పష్టం చేస్తున్నాయి. ఇటీవలి త్రైమాసిక ఆర్థిక ఫలితాల సందర్భంగా ఎఫ్ఎంసీజీ దిగ్గజం మారికో.. ఏప్రిల్‌లో హెయిర్ ఆయిల్ ధరలను 6 శాతం పెంచామని, కొబ్బరి రేట్లు పెరుగుతున్నందున మళ్లీ పెరిగేందుకు వీలున్నదని సంకేతాలిచ్చింది. టాటా కన్స్యూమర్ సైతం ఇదే దారిలో వెళ్తున్నది. డాబర్, ఇమామీ రేట్లు కొంతమేర పెరుగుతాయంటున్నాయి. మరోవైపు కూరగాయల ధరలు తారెత్తిస్తున్నాయి. కిలో టమాట సెంచరీ దిశగా పరుగు పెడుతుంటే, ఉల్లి హాఫ్ సెంచరీ కొట్టింది. పచ్చి మిర్చి రూ.80 పలుకుతున్నది. బెండ, దొండ ధరలూ పైపైకిపోతున్నాయి. అన్ని రకాల పప్పుల ధరలూ కిలో రూ.120 నుంచి 180 మేర పలుకుతున్నాయి.

- ***వివిధ రకాల సబ్బుల ధరల్ని 4-5 శాతం పెంచిన గోద్రెజ్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్. డవ్ సోప్ ధరను 2 శాతం పెంచిన హిందుస్థాన్ యునిలీవర్ లిమిటెడ్. సంతూర్ సబ్బు ధరను 3 శాతం పెంచిన విప్రో.***
- ***పెరిగిన కాల్గేట్ పామోలివ్ బాడీ వాష్ ధరలు. 4 శాతం పెరిగిన పియర్స్ బాడీ వాష్ రేటు.***
- ***హెచ్‌యూఎల్ డిటర్జంట్ బ్రాండ్లు, పీఅండ్‌జీ హైజిన్-హెల్త్‌కేర్, జ్యోతీ ల్యాబ్స్ ఉత్పత్తుల రేట్లు 1 నుంచి 10 శాతం పుంజుకున్నాయి.***
- ***హెచ్‌యూఎల్‌కు చెందిన షాంపూ ధరలు, స్కిన్ కేర్ ఉత్పత్తుల రేట్లు 4 శాతం వరకు ఎగిశాయి.***
- ***8-13 శాతం పెరిగిన నెస్లే కాఫీ ధర. మ్యాగీ ఓట్స్ నూడుల్స్ ధర 17 శాతం ఎగిసింది. ఐటీసీ ఆశీర్వాద్ గోధుమ ధరలూ పైకెక్కాయి.***

# నేర్చుకోలేకపోతున్నారు..

పెరుగుతున్న 'లౌడ్ లెర్నింగ్' • లింక్డ్ఇన్ తాజా సర్వే

## పని, కుటుంబ ఒత్తిళ్లతో నైపుణ్యాభివృద్ధిలో వెనుకబడుతున్న ఉద్యోగులు



న్యూఢిల్లీ, జూన్ 18: నేర్చుకోవడానికి వీలుగా మా సంస్థలు అన్ని అవకాశాలు కల్పిస్తున్నా వాటిని అందిపుచ్చుకోలేకపోతున్నామని ఉద్యోగులు వాపోతున్నారు. పని ఒత్తిళ్లు, కుటుంబ బాధ్యతల వల్లే నైపుణ్యాభివృద్ధిలో వెనుకబడుతున్నట్టు మెజారిటీ ఎంప్లాయిస్ చెప్తున్నారు. అవును.. దేశంలోని ప్రతీ 10 మంది ఉద్యోగ నిపుణుల్లో 9 మందిది ఇప్పుడిదే మాట అంటున్నది ప్రముఖ ప్రొఫెషనల్ నెట్‌వర్క్ లింక్డ్ఇన్ తాజా నివేదిక ఒకటి. మార్కెట్‌లో వస్తున్న మార్పులకు, మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా తమ ఉద్యోగులకు తర్ఫీదునిస్తూపోతున్నాయి చాలా కంపెనీలు. అయితే ఆఫీస్‌లో పని భారం, వ్యక్తిగత లేదా కుటుంబ బాధ్యతలతో సతమతమైపోతూ శిక్షణపై అత్యధిక ఉద్యోగులు దృష్టి సారించలేకపోతున్నారు. 91 శాతం ఉద్యోగులది ఇదే పరిస్థితి అని లింక్డ్ఇన్ తాజా అధ్యయనంలో తేలింది.

**లౌడ్ లెర్నింగ్**

పని ఒత్తిడి, వ్యక్తిగత కారణాలతో కంపెనీలు ఇస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్‌పై ఆసక్తి చూపలేకపోతున్న ఉద్యోగులు.. తమకున్న అడ్డంకులను అధిగమించడానికి 'లౌడ్ లెర్నింగ్' మంత్రాన్ని జపిస్తున్నారు. ఆఫీసులు లేదా పనిచేసే చోట నేర్చుకోవాలన్న లక్ష్యాలపై తమకున్న ఆసక్తిని ఉద్దేశపూర్వకంగా గట్టిగా వ్యక్తపరిచే చర్యనే ఈ 'లౌడ్ లెర్నింగ్' అంటారు. ఇది తమ కెరియర్ వృద్ధికి దోహదపడగలదని ఏకంగా 79 శాతం మంది ఉద్యోగులు విశ్వసిస్తుండటం గమనార్హం. ఇక లింక్డ్ఇన్ సైతం ఉద్యోగ నిపుణుల కోసం కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత అత్యుత్తమ సాధనాలను అందుబాటులోకి తెచ్చింది. కాగా, అనుభవజ్ఞులైన నిపుణుల నుంచి మెంటార్‌షిప్, గైడెన్స్ అవసరమని, కొత్త అవకాశాలను అందిపుచ్చుకునేలా శిక్షణ కావాలని, మారుతున్న టెక్నాలజీ, పరిస్థితులపై అవగాహనను పెంచుకోవడం తప్పనిసరి అని ఈ అధ్యయనంలో పాల్గొన్న ఎక్కువమంది ఉద్యోగులు అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం చాలా కంపెనీలు ఏఐ ఆధారిత సేవలు, ఉత్పాదకతపై దృష్టి పెడుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే పెద్ద ఎత్తున ఉద్యోగ కోతలూ జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో తాజా సర్వే ప్రాధాన్యతను సంతరించుకున్నది.

***దేశంలో ఉద్యోగాల కోసం ఇప్పుడు అవసరమైన నైపుణ్యాల్లో 2030 నాటికి 64 శాతం మారిపోవచ్చు. అందుకే ఉద్యోగులు ఎప్పటికప్పుడు కొత్తదనాన్ని ఆహ్వానిస్తూపోవాలి. నయా టెక్నాలజీలు, నూతన అంశాలపై దృష్టి సారించి వాటిలో ఆరితేరాలి. అప్పుడే కొలువులు భద్రంగా ఉంటాయి.***

***-నిరాజితా బెనర్జీ, లింక్డ్ఇన్ కెరియర్ ఎక్స్‌పర్ట్***

### ఎల్ అండ్ టీకి భారీ ఆర్డర్లు

న్యూఢిల్లీ, జూన్ 18: ఎల్అండ్‌టీకి హైదరాబాద్, ముంబైల నుంచి భారీ ఆర్డర్లు లభించాయి. బిల్డింగ్స్ అండ్ ఫ్యాక్టరీస్ (బీఅండ్ఎఫ్) విభాగం నుంచి ఇవి వచ్చాయని సంస్థ వెల్లడించింది. ఆర్డర్ విలువ సంస్థ వెల్లడించకపోయినప్పటికీ ప్రాజెక్ట్ విలువ ఆధారంగా రూ.1,000 కోట్ల నుంచి రూ.2,500 కోట్ల మధ్యలో ఉంటుందని అంచనా.

### 'ఇప్పట్లో వడ్డీరేట్లు తగ్గవు'

ముంబై, జూన్ 18: ఇప్పట్లో వడ్డీ రేట్లు తగ్గే అవకాశాలు లేవని, సమయం వచ్చినప్పుడు రేట్లపై నిర్ణయం తీసుకుంటామని ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ స్పష్టంచేశారు. ఈటీ నౌస్ లీడర్‌షిప్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ..పరపతి సమీక్షను అత్యవసరంగా మార్చాల్సిన అవసరం లేదని, ద్రవ్యోల్బణం దిగొచ్చాక, మిగతా పరిణామాలను కూడా బేరీజు వేసుకున్న తర్వాతనే రేట్ల తగ్గింపుపై నిర్ణయం తీసుకుంటామన్నారు. మరోవైపు ఫ్యూచర్, ఆప్షన్ ట్రేడింగ్ మార్కెట్లలో అధిక ట్రేడింగ్ గణాంకాలపై సెబీతో కలిసి ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. అలాగే మార్చి త్రైమాసికపు కరెంట్ ఖాతా లోటును వచ్చేవారంలో విడుదల చేస్తామన్నారు.

### న్యూయార్క్ స్థాయిలో హైదరాబాద్ వృద్ధి

**సీఎం రేవంత్ రెడ్డి**

హైదరాబాద్, జూన్ 18 (నమస్తే తెలంగాణ): అమెరికాలో స్థిరపడిన రాష్ట్ర ప్రజలు న్యూయార్క్‌తో పోల్చుకునేలా హైదరాబాద్‌ను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉన్నదని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. కుష్‌మన్ అండ్ వేక్ ఫీల్డ్ ఆసియా పసిఫిక్ సీఈవో మ్యాథ్యూ భౌ ప్రతినిధి బృందం మంగళవారం సచివాలయంలో సీఎంతో భేటీ అయ్యింది. హైదరాబాద్ గ్లోబల్ సిటీగా వృద్ధి చెందుతున్న తీరు, వివిధ రంగాలు విస్తరిస్తున్న తీరుపై వారు చర్చించారు. తమ ప్రభుత్వం చేపట్టిన మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు, రీజనల్ రింగ్ రోడ్డు, మెట్రో రైలు రూట్ విస్తరణతో హైదరాబాద్ మరింత అద్భుతంగా తయారుకానున్నదని రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. తాము దేశంలోని ఇతర నగరాలతో పోటీ పడటం లేదని, హైదరాబాద్‌ను ప్రపంచంలో పేరొందిన నగరాల సరసన నిలబెట్టాలనేది తమ సంకల్పమన్నారు. ఈ సందర్భంగా మ్యాథ్యూ భౌ మాట్లాడుతూ.. దేశంలోనే హైదరాబాద్ శరవేగంగా వృద్ధి చెందుతున్నదని, గత ఆరు నెలల్లో రియల్టీతోపాటు ఆఫీస్ స్థలాల లీజు, నిర్మాణం, రెసిడెన్షియల్ స్పేస్‌లోనూ గణనీయమైన వృద్ధి నమోదు చేసిందన్నారు. మరోవైపు, మంగళవారం సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డితో లాక్ హీడ్ మార్టిన్ కంపెనీ హెడ్ మిస్టర్ ఫర్నాండేజ్ భేటీ అయ్యారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



### హైదరాబాద్‌లో ఎన్ఎండీసీ పరిశోధన సెంటర్


హైదరాబాద్, జూన్ 18: ఖనిజ ఉత్పత్తిలో అగ్రగామి ప్రభుత్వరంగ సంస్థయైన ఎన్ఎండీసీ.. తాజాగా హైదరాబాద్‌లో పరిశోధన-అభివృద్ధి కేంద్రాన్ని(ఆర్అండ్‌డీ సెంటర్) ప్రారంభించింది. ఖనిజ ఉత్పత్తి, ప్రాసెసింగ్, స్థిరమైన ఉక్కు సాంకేతికలో ఆవిష్కరణలే లక్ష్యంగా పటాన్‌చెరు వద్ద ఎనిమిది ఎకరాల స్థలంలో ఏర్పాటు చేసిన సెంటర్ కోసం రూ.50 కోట్ల నిధులు వెచ్చించినట్లు కంపెనీ సీఎండీ(అదనపు) అమితావ ముఖర్జీ తెలిపారు. స్థిరమైన వృద్ధిని నమోదు చేసుకుంటున్న దేశీయ గనుల రంగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయని ఈ సందర్భంగా ఆయన చెప్పారు.

# దూసుకుపోతున్న స్టాక్ మార్కెట్లు

**77 వేల పైకి సెన్సెక్స్ • 308 పాయింట్లు పుంజుకున్న సూచీ**

ముంబై, జూన్ 18: దేశీయ స్టాక్ మార్కెట్లు రికార్డు స్థాయిలో దూసుకుపోతున్నాయి. బెంచ్‌మార్క్ ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ తొలిసారిగా 77 వేల మార్క్‌ను అధిగమించగా, నిఫ్టీ సైతం మరో ఉన్నత శిఖరాలకు చేరుకున్నది. బ్లూచిప్ సంస్థల షేర్లకు మదుపరుల నుంచి లభించిన మద్దతుకు తోడు, అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలు సూచీలకు కిక్కునిచ్చాయి. 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 308.37 పాయింట్లు అందుకొని నూతన గరిష్ఠ స్థాయి 77,301.14 వద్ద ముగిసింది. ఇంట్రాలో 374 పాయింట్లు ఎగబాకి లైఫ్‌టైం హై 77,367 తాకి చివర్లో ఈ లాభాలను నిలుపుకోలేకపోయింది. మరో సూచీ నిఫ్టీ 92.30 పాయింట్లు ఎగబాకి రికార్డు స్థాయి 23,557.90 వద్ద స్థిరపడింది. దీంతో బీఎస్ఈలో లిస్టైన సంస్థల విలువ రికార్డు స్థాయి రూ.4,37,24,261.40 కోట్లు(5.24 ట్రిలియన్ డాలర్లకు) చేరుకున్నది. గత నాలుగు సెషన్లలో మదుపరుల సంపద రూ.10.29 లక్షల కోట్ల మేర పెరిగింది. సూచీల్లో పవర్ గ్రిడ్, విప్రో, ఐసీఐసీఐ బ్యాంక్, టైటాన్, మహీంద్రా అండ్ మహీంద్రా, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఇన్ఫోసిస్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఎస్బీఐ షేర్లు అత్యధికంగా లాభపడ్డాయి. కానీ, మారుతి, అల్ట్రాటెక్ సిమెంట్, టాటా స్టీల్, టాటా మోటర్స్, ఐటీసీ, టీసీఎస్‌లు నష్టపోయాయి.

### మహీంద్రా వరి నాటే యంత్రం



ధర : 2.50 లక్షలు

హైదరాబాద్, జూన్ 18: మహీంద్రా అండ్ మహీంద్రా.. వ్యవసాయ ఉత్పత్తుల విభాగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా తెలుగు రాష్ట్రాల్లో ఆరు వరుసల వరి నాటే 6ఆర్‌వో యంత్రాన్ని ఆవిష్కరించింది. వరిసాగు సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు అత్యంత శక్తివంతమైన, సమర్థవంతమైన ఇంజిన్, అధునాతన టెక్నాలజీతో దీనిని రూపొందించింది. మహీంద్రా ఫైనాన్స్, శ్రీరామ్ ఫైనాన్స్‌తోపాటు ఇతర ఆర్థిక సంస్థల నుంచి 75 శాతం వరకు ఫైనాన్స్ లభించనున్నది.

### జోరుగా పన్ను వసూళ్లు

న్యూఢిల్లీ, జూన్ 18: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు రూ.4,62,664 కోట్ల ప్రత్యక్ష పన్నులు వసూలైనట్లు ఐటీ శాఖ వెల్లడించింది. ఈ నెల 15 నాటికి తొలి విడత అడ్వాన్స్ ట్యాక్స్ వసూళ్లు 27.34 శాతం ఎగబాకి రూ.1.48 లక్షల కోట్లకు పెరగడం కలిసొచ్చింది.

### జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన కలెక్టర్



జిల్లా జడ్జికి పుష్పగుచ్ఛం ఇస్తున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 18 (నమస్తే తెలంగాణ): జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన జితేశ్ వి పాటిల్ మంగళవారం సాయంత్రం జిల్లా కోర్టు సముదాయంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు.

### రామనారాయణ అంశంపై విచారణ

భద్రాచలం, జూన్ 18 : రామనారాయణ అంశంపై భద్రాచలం రామాలయంలో దేవాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ కృష్ణవేణితోపాటు మరో నలుగురు బృందం మంగళవారం విచారణ చేపట్టినట్లు తెలిసింది. పై అంశంపై ఆలయంలో విధులు నిర్వహిస్తున్న అర్చకులతో వారు సమావేశమైనట్లు సమాచారం. సీతారామచంద్రస్వామివారి కల్యాణంలో 'రామ నారాయణ స్వామినే వరాయ' అని స్వామివారిని, 'సీతామహాలక్ష్మి నామ్నీం' అని అమ్మవారిని అర్చకులు పేర్కొనడంపై కొందరు భక్తులు హైకోర్టును ఆశ్రయించారు. కొన్నేళ్లుగా భద్రాచలంలో నిర్వహిస్తున్న సీతారామ కల్యాణంలో గతంలో ఉన్న గోత్రనామాలను మార్చి చదువుతున్నారంటూ పలువురు పట్టణంలో విమర్శలు చేయడంతోపాటు దీనిపై ప్రెస్‌మీట్‌లు పెట్టి పలుమార్లు తమ ఆవేదనను వెలిబుచ్చారు. అసలు రామాలయంలో జరుగుతున్నది సీతారాముల కల్యాణమా? లక్ష్మీనారాయణుల కల్యాణమా? అని వారు వాపోయారు. రామునిది వశిష్ట గోత్రం, సీతమ్మది గౌతమ గోత్రం కాగా.. భద్రాచలం దేవస్థానంలో రాముడికి అచ్యుత గోత్రం, సీతమ్మకు సౌభాగ్య గోత్రం చెబుతున్నారని భక్తుల ఆవేదన. అలాగే ప్రవర విషయంలో కూడా ఈ విధంగానే ఆలయ అర్చకులు, వేద పండితులు వ్యవహరిస్తున్నారని, దీనిని మార్చడంపైనా విమర్శలున్నాయి. అంతేకాక ఈ విషయంపై కొందరు భక్తులు కొన్ని రోజుల క్రితం హైకోర్టుకు వెళ్లడంతో ఈ వివాదాన్ని పరిష్కరించాలంటూ హైకోర్టు ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీని నియమించింది. విచారణ కమిటీలో ఉన్న ఎండోమెంట్ అడిషనల్ కమిషనర్ కృష్ణవేణితోపాటు మరో నలుగురు మంగళవారం విచారణ చేసేందుకు వచ్చారు. మొదటిరోజు పట్టణానికి చెందిన డాక్టర్ బూసిరెడ్డి శంకరరెడ్డి, రాధాకృష్ణశాస్త్రి, రామాయణం శర్మలతోపాటు ఆలయంలో విధులు నిర్వహిస్తున్న అర్చకులతో వారు సమావేశమయ్యారని సమాచారం. కాగా.. మరో రెండు రోజులపాటు విచారణ ఉంటుందని దేవస్థానం అధికారులు తెలిపారు.

# సింగరేణిలో సమయపాలనపై నిఘా!

- **డ్యూటీకి రాకుండా మస్టర్ పడితే వేటే..**
- **క్రమశిక్షణ, సమయపాలన పాటించని వారిపై కఠిన చర్యలు**
- **అధికారులు పని ప్రదేశాలను నిత్యం తనిఖీ చేయాల్సిందే..**
- **సింగరేణి సీఎండీ బలరాం స్పష్టీకరణ**



సింగరేణి సీఎండీ బలరాం

కొత్తగూడెం సింగరేణి, జూన్ 18 : సింగరేణి సంస్థలో పని సంస్కృతిని పెంచేందుకు కీలక చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు బొగ్గు ఉత్పత్తిపై దృష్టి సారించిన సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం.. కార్యాలయాల్లో ఉద్యోగులు, అధికారుల సమయ పాలనపై ప్రత్యేక నిఘా పెట్టారు. గనులు, కార్యాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న కొందరు డ్యూటీకి రాకున్నా కూడా మస్టర్ పడుతున్నట్లు, మరికొందరు మస్టర్ వేయించుకొని మధ్యలోనే వెళ్తున్నట్లు నిఘా వర్గాల ద్వారా వచ్చిన ఫిర్యాదులపై ఆయన తీవ్రంగా స్పందించారు. భూగర్భ గనుల్లో పని ప్రదేశాలను సంబంధిత అధికారులు నిత్యం తనిఖీ చేయకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ మేరకు ఆయన మంగళవారం హైదరాబాద్ సింగరేణి భవన్ నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. సింగరేణి సంస్థలో ఉద్యోగులు, అధికారులంతా కూడా ఇకపై తప్పనిసరిగా బయోమెట్రిక్ అటెండెన్స్ నమోదు చేసుకోవాలని, దీనిపై ఆయా ఏరియా జీఎంలు, విభాగాధిపతులు చర్యలు తీసుకోవాలన్నారు. భోజన విరామం పూర్తయిన తర్వాత నిర్ణీత సమయంలో మళ్లీ తమ తమ సీట్లలో కూర్చొని పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలన్నారు. లంచ్ బ్రేక్‌లో చాలా మంది మూడు గంటలపాటు విరామం తీసుకోవడం వల్ల పలు పనులు, ఫైళ్లు పెండింగ్‌లో ఉంటున్నాయని పలువురు తన దృష్టికి తెచ్చారని పేర్కొన్నారు. దీనిపై సెక్యూరిటీ విభాగం ద్వారా నివేదికలు తెప్పించుకొని.. గతంలో సింగరేణి ఆస్పత్రుల్లోని డిస్పెన్సరీల్లో వైద్యులు, సిబ్బంది సకాలంలో విధులకు రాకపోతే మెమోలు జారీ చేసిన విషయం తెలిసిందే. మళ్లీ ఇప్పుడు సమయ పాలన పాటించని వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సింగరేణిలో పనిచేసే ప్రతీ ఉద్యోగి, అధికారి కచ్చితమైన సమయపాలన పాటించాలని, డ్యూటీలో చేరిన తర్వాత బయటకు వెళ్లడం కానీ, పని చేయకుండా కూర్చోవడం కానీ చేయొద్దన్నారు. ఈ విషయంలో ఎంతటి పెద్ద వారైనా, పలుకుబడి ఉన్న వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

**మరింత బాధ్యతగా విధులు నిర్వర్తించాలి..**

బొగ్గు ఉత్పత్తి చేస్తున్న కార్మికులు రోజూ ఎనిమిది గంటలు పని చేస్తున్నారని, వారికి సంబంధించిన సంక్షేమం, ఇతరత్రా పనులను నిర్వర్తించే ఉద్యోగులు, అధికారులు మరింత బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే కార్యాలయంలో పనిచేసే ఉద్యోగుల్లో కొందరు ఏదో సాకు చూపి తాము పనిచేసే కార్యాలయాలను వదిలి వరండాల్లో తిరగడం, బయటికి వెళ్లడం, కబుర్లతో కాలక్షేపం చేస్తే సంబంధిత విభాగాధిపతులపై చర్యలు ఉంటాయన్నారు. దీనిపై నిఘా విభాగం నుంచి ఎప్పటికప్పుడు నివేదికలు తీసుకుంటామన్నారు. సింగరేణి సంస్థ వ్యాపార విస్తరణలో భాగంగా ఇతర రంగాల్లోకి విస్తరిస్తోందని, దీంతో కంపెనీ ఉత్పాదకత మరింతగా పెరగాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. దీనికి ఉద్యోగులు, అధికారులు క్రమశిక్షణతో విధులు నిర్వర్తించడం అత్యవసరమన్నారు.

**సంస్థ అభివృద్ధికి సహకరించాలి..**

ప్రైవేట్ రంగంతో పోటీ పడుతున్న మన సంస్థ మనుగడ సాగించాలంటే పని గంటలను సద్వినియోగం చేసుకోవాల్సి ఉంటుందన్నారు. క్రమశిక్షణ గల సంస్థగా సింగరేణిని రూపుదిద్దడంలో ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు. ఎక్కువ మంది కార్మికులు, ఉద్యోగులు, అధికారులు సంస్థపై అభిమానంతో, వేరెవరో చెప్పే అవసరం లేకుండానే తమకు ఇచ్చిన పనిని అంకితభావంతో పూర్తి చేస్తున్నారని, డ్యూటీ సమయం మొత్తం విధులు నిర్వర్తిస్తున్నారని, అటువంటి వారిని అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కానీ.. కొందరు విధులకు గైర్హాజరవుతూ మస్టర్ పడి కూడా బయటకు వెళ్లడం లేదా.. డ్యూటీలో ఉండి కూడా పని చేయకుండా కూర్చుంటున్నారని, ఇలాంటి వారి వల్ల ఇతరులు కూడా పాడైపోయే అవకాశం ఉందని హెచ్చరించారు. పని సంస్కృతిని దెబ్బతీస్తే యాజమాన్యం కఠిన చర్యలు తీసుకుంటుందని, అవసరమైతే క్రమశిక్షణ లేని ఉద్యోగులను విధుల నుంచి తొలగించడానికి కూడా వెనుకాడబోమన్నారు.

**కార్పొరేట్‌లో 32 మంది ఆలస్యంగా విధులకు...**

సీఎండీ బలరాం ఆదేశాల మేరకు సింగరేణి సెక్యూరిటీ విభాగం మంగళవారం ఉదయం కొత్తగూడెంలోని సింగరేణి కార్పొరేట్ ఆఫీస్‌లో ఉద్యోగులు విధులకు వచ్చే, భోజనానికి వెళ్లే సమయాలను రికార్డు చేశారు. ఆలస్యంగా వచ్చిన 32 మంది ఉద్యోగుల వివరాలను సంబంధిత శాఖల అధికారులకు పంపించారు. దీంతో ఆయా విభాగాల అధిపతులు వారిని మందలించారు. ఇకపై నిరంతర ప్రక్రియగా సమయపాలనను నమోదు

### వివాహేతర సంబంధం నేపథ్యంలో..

**ఉపాధ్యాయుడికి దేహశుద్ధి**



దేహశుద్ధికి గురైన ఉపాధ్యాయుడు రాందాస్(నల్ల షర్టు)

అశ్వారావుపేట, జూన్ 18 : ఓ వివాహితతో వివాహేతర సంబంధం నెరపుతున్నాడనే నెపంతో ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడికి బంధువులు, గ్రామస్తులు దేహశుద్ధి చేశారు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం నెమలిపేట గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామంలోని ఐటీడీఏ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న లవుడ్యా రాందాస్.. అదే గ్రామంలోని ఓ వివాహితతో వివాహేతర సంబంధం పెట్టుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో మంగళవారం విధులు నిర్వర్తిస్తున్న రాందాస్‌ను పాఠశాల నుంచి తీసుకొచ్చి గ్రామంలోని రహదారి పక్కన ఉన్న చెట్టుకు తాళ్లతో కట్టి నిర్బంధించారు. ఆ వివాహితను కూడా ఇంటి నుంచి అదే చెట్టు వద్దకు లాక్కొచ్చి ఇద్దరికి దేహశుద్ధి చేశారు. విషయం తెలుసుకున్న ఎంఈవో పి.కృష్ణయ్య.. సీఐ జితేందర్‌రెడ్డికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. సీఐ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని ఉపాధ్యాయుడు రాందాస్‌ను విడిపించి పోలీస్‌సేషన్‌కు తరలించారు. ఇరువర్గాల వారు పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని పరస్పర ఫిర్యాదులు చేసుకున్నారు. దీనిపై పోలీసులు స్పందిస్తూ ఘటనపై తమకు ఎలాంటి లిఖితపూర్వక ఫిర్యాదులు అందలేదని ఎస్సై శ్రీను తెలిపారు.

# వరదలపై అప్రమత్తంగా ఉండాలి

**భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్**



మాట్లాడుతున్న భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 18 (నమస్తే తెలంగాణ) : వర్షాకాలంలో గోదావరి వరదలతో ప్రజలకు, ముంపు ప్రాంతవాసులకు ఇబ్బంది లేకుండా చూడాలని, అందుకోసం ముందస్తు ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడీవోసీ కార్యాలయంలో గోదావరి వరదలపై వివిధ శాఖల అధికారులతో ముందస్తు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు ప్రయోగాత్మకంగా డ్రోన్ ద్వారా తాడును బాధితులకు చేరవేయాలని సూచించారు. ముందస్తు ఫ్లడ్ మేనేజ్‌మెంట్ ప్రణాళిక రూపొందించాలని, ముంపునకు గురయ్యే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వరదల నుంచి ప్రజలను కాపాడేందుకు గ్రామస్థాయి నుంచి ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు లైఫ్ జాకెట్లు, గజ ఈతగాళ్లు, నాటు పడవలు, బోట్లు సిద్ధంగా ఉంచాలని చెప్పారు. అక్టోబర్ వరకు సరిపోను అన్ని రకాల నిత్యావసర వస్తువులు స్టాక్ ఉంచాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారిని ఆదేశించారు. వరద ముంపు పర్యవేక్షణకు సెక్టోరియల్, జోనల్ అధికారులను నియమించనున్నట్లు తెలిపారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా విద్యుత్ శాఖ అధికారులు ముంపు గ్రామాల్లో పరిశీలన చేయాలన్నారు. అత్యవసర సేవలకు హెలిక్యాప్టర్ సేవలు వినియోగించుకోవడానికి అనుగుణంగా హెలిప్యాడ్లు ఏర్పాటు చేయాలని రోడ్లు, భవనాల శాఖ అధికారులకు సూచించారు. అలాగే మొబైల్ సెట్లు వినియోగించేందుకు సెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో 24 గంటలు పనిచేసే విధంగా ఫ్లడ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటుతోపాటు మండల, జిల్లాస్థాయిలో కంట్రోల్ రూములు ఏర్పాటు చేయాలన్నారు. సింగరేణి, కేటీపీఎస్, ఐటీసీ, నవభారత్ సంస్థల రెస్క్యూ టీముల సేవలు వినియోగించుకునేందుకు జాబితా అందుబాటులో ఉంచాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వల్ల ఏ ఒక్క ప్రాణనష్టం జరిగినా సంబంధిత అధికారులపైన కఠిన చర్యలు ఉంటాయని కలెక్టర్ హెచ్చరించారు. సమావేశంలో భద్రాచలం ఏఎస్పీ పంకజ్ పరితోశ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, భద్రాచలం ఆర్డీవో దామోదర్‌రావు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

### ఛత్తీస్‌గఢ్‌లో ఎదురు కాల్పులు

కొత్తగూడెం క్రైం, జూన్ 18 : మావోయిస్టులు, భద్రతా దళాలకు మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాలో మంగళవారం చోటు చేసుకుంది. సుక్మా జిల్లాలో బస్తర్ ఫైటర్స్, డీఆర్‌జీ భద్రతా దళాలు మావోయిస్టులు కోసం చింతల్నార్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అడవుల్లో సెర్చింగ్ ఆపరేషన్స్ నిర్వహిస్తున్నాయి. ఈ క్రమంలో కరకన్‌గుండ అడవుల్లో మావోయిస్టులు తారసపడి జవాన్లపైకి కాల్పులు జరిపారు. వెంటనే అప్రమత్తమైన జవాన్లు ఎదురు కాల్పులకు దిగారు. జవాన్లు కాల్పుల్లో వేగం పెంచడంతో వారి ధాటికి తాళలేక మావోయిస్టులు కాల్పులు జరుపుతూనే అక్కడి నుంచి పారిపోయారు. కాల్పుల విరమణ తర్వాత భద్రతా దళాలు అ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకొని గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలో మావోయిస్టులకు సంబంధించిన ఆయుధ, మందు గుండు, వస్తు సామగ్రిని భారీ ఎత్తున స్వాధీనం చేసుకున్నారు.

### గిరిజన గురుకుల డిగ్రీ కళాశాలలో చేరేందుకు ఆహ్వానం

కొణిజర్ల,, జూన్ 18 : స్థానిక గిరిజన గురుకుల సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల ఖమ్మంలో డిగ్రీ ప్రథమ సంవత్సరం ప్రవేశాల కోసం ఆహ్వానం పలుకుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కే.మానస, ఖమ్మం ఆర్‌సీవో వెంకటేశ్వర్లు తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం పూర్తి చేసుకున్న విద్యార్థులు మంగళవారం నుంచి ఈ నెల 23వ తేదీ లోపు నిర్వహించే స్పాట్ అడ్మిషన్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. స్పాట్ అడ్మిషన్లకు హాజరయ్యే విద్యార్థులు అన్నిరకాల ఒరిజినల్ సర్టిఫికెట్స్, మూడు జిరాక్స్ సెట్లు, ఆధార్‌కార్డు, ఫొటోలు తీసుకొని రావాలని సూచించారు. వివరాలకు 9491063083, 9640947467 నెంబర్లను సంప్రదించాలని కోరారు.